జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 7 | మే | 2026 ◆ పేజీలు : 6

## యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు



**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులు జీవితంలో స్థిరపడటానికి వైటిసి ద్వారా అందించే శిక్షణలు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శిక్షకులు యువతీ యువకులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు సర్ సెంటర్ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను శిక్షకులతో , యువతీ యువకులతో

మిగతా 2 లో...




# రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 6,(ప్రజాజ్యోతి)** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు , ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1 లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు అవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు

మిగతా 2 లో...

## అధికారుల నిర్లక్ష్యం.... ప్రమాదాలకు నెలవు



- భద్రాచలం వారధి ప్రవేశం వద్ద తరచూ రహదారి ప్రమాదాలు
- ఇటీవల కాలంలో మూడు ప్రమాదాలు
- ప్రమాద సూచికలు ఏర్పాటు చేయని జాతీయ రహదారుల శాఖ అధికారులు

**భద్రాచలం టౌన్, మే 6 ప్రజాజ్యోతి,** భద్రాచలంలోకి ప్రవేశించే గోదావరి వారధి మూలమలుపు వద్ద ఇటీవల కాలంలో తరచూ రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు అదుపు తప్పి పక్కనే ఉన్న టవర్‌ను ఢీకొట్టడం పలు మార్లు జరిగాయి. బ్రిడ్జి మీద నుంచి అప్రోచ్ రోడ్డకు వచ్చే వాహనాలు అయ్యప్పగుడి సమీపంలో యు ఆకారంలో ఉండే రహదారి వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు జాతీయ రహదారుల శాఖ అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు కొందరు డ్రైవర్లు అదుపు చేయలేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా బుధవారం భద్రాచలం రామాలయంకు కారులో తొమ్మిదితో

మిగతా 2 లో...

## ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని సరైన వైద్య సేవలు అందించాలి

- భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట



**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులకు వేసవిని దృష్టిలో పెట్టుకొని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని సరైన వైద్య సేవలు అందించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ వ్యాధులతో చికిత్స పొందుతున్న జనరల్ వార్డ్, మెటర్నిటీ వార్డ్, పీడియాట్రిక్ వార్డు, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మిగతా 2 లో...

## రైతులు ఆయిల్‌ఫామ్ పంటలు సాగు చేయాలి

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు




**భద్రాచలం టౌన్ , మే 6 , ప్రజాజ్యోతి** రైతులు ఆయిల్‌ఫామ్ పంటలను సాగు చేసేందుకు ముందుకు రావాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం జరిగిన రైతు వారోత్సవాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌ఫామ్ సాగు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అలాగే పంటల దిగుబడి, ధర, ధాన్యం సేకరణ ఇతర అంశాల్లో ప్రభుత్వం రైతులకు వెన్నంటే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి



(మొదటి పేజీ తరువాయి... )

తావు ఉండకూడదన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ జిల్లా ,మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు ఎరువుల డీలర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.... ప్రమాదాలకు నెలవు

(మొదటి పేజీ తరువాయి... )

వస్తున్న వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్తు టవర్‌ను ఢీకొట్టింది. ఇదే విధంగా ఇటీవల కాలంలో మరో కారు ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. అధికారులు ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రామ భక్తులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు సైడ్ రైలింగ్, సైన్ బోర్డులు, రోడ్డు సరిహద్దును సూచించే రేడియం స్టిక్కరింగ్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి... )

ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న నిరుద్యోగ గిరిజన యువతి యువకులు పై చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఐటీడీఏ ప్రాంగణంలోని వై టి సి లో అందిస్తున్న వివిధ రకాల శిక్షణలను శ్రద్ధగా తీసుకొని ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని ఆయన అన్నారు. ఈసారి బాగా గుర్తింపు పొందిన సంస్థలైన ఐటీ హెల్ప్ డెస్క్, అటెండెంట్ కోర్స్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్స్, ఎంబ్రాయిడరీ మిషన్ ఆపరేటర్ కోర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్, టైలరింగ్ మిషన్ ఆపరేటర్ కోర్స్ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా శిక్షణలు ఇప్పిస్తున్నందున యువతి యువకులు శ్రద్ధగా మూడు నెలల పాటు శిక్షణ తీసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. సంబంధిత కంపెనీల శిక్షకులు యువతీ యువకులకు పూర్తిస్థాయిలో నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణలు అందించాలని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతీ యువకులకు తప్పనిసరిగా ఉపాధ్యాయ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వైటిసి సెంటర్ ఇన్చార్జి శ్రీను, భవిత సేల్స్ సిబ్బంది సమ్మయ్య, మణిదీప్, దీనాకుమారి, అనురాధ, అభిరామ్ పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక వైభవం.. ఘనంగా ముగిసిన మహా కుంభాభిషేక మహోత్సవాలు











- ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు
- జారే ఆదినారాయణ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు స్వీకరణ
- ప్రముఖ పుణ్యక్షేత్రాల అర్చకులు, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రముఖుల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ
- ఆరు రోజుల పాటు భక్తి శ్రద్ధల మధ్య కొనసాగిన మహోత్సవాలు

**అన్నపురెడ్డిపల్లి, మే 6, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని అన్నపురెడ్డిపల్లి గ్రామం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి మహా కుంభాభిషేక మహోత్సవాలతో ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. మే 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ మహోత్సవాలు బుధవారం అత్యంత ఘనంగా ముగిశాయి. ఆరు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా కొనసాగి వేలాది మంది భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మహా కుంభసంప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలను ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య ఆశీస్సులతో, ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పవిత్ర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం భక్తిరసమయంగా మారింది. బుధవారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహా పూర్ణాహుతి, మూలా నక్షత్ర యుక్త మిధున లగ్న సువేళలో ఉదయం 9 గంటల 43 నిమిషాలకు శ్రీ చిన్న జీయర్ స్వామి వారి కరకమలాలతో మహా కుంభసంప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రధమ ఆరాధన, శాంతి కల్యాణం, మహా నివేదన, మంగళ హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మహోత్సవంలో భాగంగా అగ్ని ప్రతిష్ఠతో యజ్ఞ కార్యక్రమాలు ప్రారంభమై పుణ్యాహవాచనం, వాస్తు శాంతి, మహాసంకల్పం, విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన చేసి పవిత్ర తీర్థ జలాలతో ఆలయ గోపురం, విమానం, ధ్వజస్తంభం, గర్భగుడికి ప్రత్యేకంగా కుంభాభిషేకం జరిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, స్నపన తిరుమం జనం, అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించగా ఆలయం పుష్పాలంకరణతో శోభాయమానంగా అలంకరించబడింది. మహానస శ్రీ మహాలక్ష్మీ దేవి, శ్రీ సుదర్శన నరసింహ స్వామివారి విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కూడా అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాలు భక్తులకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. ఈ మహోత్సవాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సతీ సమేతంగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. అలాగే అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ దంపతులు కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వ విజయ్ బాబు, డీసీసీ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న తదితర ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం ప్రధాన అర్చకులు, యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు, వివిధ పుణ్యక్షేత్రాల ప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, వేద పండితులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి ఆశీర్వచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహోత్సవాలు ప్రశాంతంగా, ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. భక్తులకు తాగునీరు, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్ తదితర మౌలిక సదుపాయాలు సమర్థవంతంగా కల్పించారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారు. ఈ మహోత్సవాల విజయానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక కృషి చేశారు. ఆలయ అభివృద్ధి పనుల నుంచి మహోత్సవాల ఏర్పాట్ల వరకు ప్రతి అంశాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తూ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సమగ్రంగా నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రివరకు వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్న సమారాధన చేపట్టారు. సేవా బృందాలు, యువకులు, మహిళా సంఘాలు భక్తులకు వినయంగా సేవలందించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, భక్తులు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించగా, భక్తుల రాకపోకలతో అన్నపురెడ్డిపల్లి గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఆరు రోజుల పాటు కొనసాగిన ఈ మహా కుంభాభిషేక మహోత్సవాలు భక్తులలో అపారమైన భక్తి భావాన్ని నింపాయి. స్వామివారి కృపతో కార్యక్రమం విజయవంతంగా ముగియడం పట్ల కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు।

## ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని సరైన వైద్య సేవలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి... )

ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు, సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అటెండెన్స్ రిజిస్టర్లు, ఓపీ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లను సబ్ కలెక్టర్ తనిఖీ చేసి, విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్ తో పాటు ఇతర సిబ్బంది హాజరును కూడా పరిశీలించారు. ఏరియా ఆసుపత్రికి వచ్చిన రోగులతో సబ్ కలెక్టర్ కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అవసరమైన మందులు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ఎండలు దురుతున్నందున ప్రజలు ఎక్కువ శాతం వడ దెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నందున బయటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రోగులకు సూచించారు. ఏరియా ఆసుపత్రిలో మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ మరియు వైద్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- జగన్నాధపురం రైతు వేదిక సదస్సులో
- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, మే 6 (ప్రజా జ్యోతి)**

రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నదని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు వారోత్సవాల లో భాగంగా పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం రైతు వేదికలో పాల్వంచ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సంక్షేమ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రైతులకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు.రైతు రుణమాఫీ,ఎకరానికి రెండు దఫాలుగా 12 వేల రూపాయలు రైతు భరోసా, రైతు భీమా, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర తో పాటు సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్, రైతు వేదికలో రైతులకు శాస్త్రవేత్తల ద్వారా పంటల మెళుకువలు శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. రైతు సహకార వారోత్సవాలలో రైతులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కొత్వాలఅన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి ఏ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూ రావు, హార్టికల్చర్ ఆఫీసర్ జె కిషోర్, లేబర్ ఆఫీసర్ బి ఎన్ రాజు, డిసిసిబి మేనేజర్ ఏ స్వప్న, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజా ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం జయశ్రీ, మండల వ్యవసాయ శాఖాధికారి పి శంభో శంకర్, సొసైటీ సీఈవో జి లక్ష్మి నారాయణ, సొసైటీ డైరెక్టర్లు జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, గంధం వీచిన రామయ్య, బి అశోక్, పాల్గొన్నారు.

## గ్యాస్,పెట్రోల్ ధరల పెంపుపై సిపిఐ నిరసన



**పినపాక,మే 06(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలో గ్యాస్,పెట్రోల్,డీజిల్ కొరతను నివారించి దిగుమతులను పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.తోగటి కుమార్ మాట్లాడుతూ.. మండలంలో పంటల కోతల సమయంలో డీజిల్ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని,గ్యాస్, పెట్రోల్ , డీజిల్ కొరత లేదని చెప్పే పాలకులు ఒక్కసారి పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఒక్కొక్క సిలిండర్ పై రూ.2000 నుండి రూ.3000 ధర అమ్ముతున్నారు. గ్యాస్,పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోజిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహర చారి,సహాయ కార్యదర్శులు కప్ప వెంకటేశ్వర్లు, రమేష్ ఐలయ్య, వర్షా నరసింహారావు, హమాలీల సంఘం కుర్రి నర్సయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో కొత్త డిగ్రీ కోర్సులు

- అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ ప్రోగ్రామ్స్ ప్రారంభం



**పాల్వంచ, మే 6 ప్రజాజ్యోతి:** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల లో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ తెలిపారు. యూజీసీ ఆమోదంతో, జాతీయ విద్యా విధానం మార్గదర్శకాల ప్రకారం కళాశాలలో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఈడీపీ)ను ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బీకాంలో బీఎఫ్ఎస్ఐ, బీఎస్సీలో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులను ఈ విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోర్సుల్లో విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణ, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించబడతాయి.కోర్సు వ్యవధి మూడు సంవత్సరాలు కాగా, ఐదో సెమిస్టర్‌లో ఆరు నెలల చెల్లింపు అప్రెంటిస్‌షిప్ ఉంటుంది. శిక్షణ కాలంలో నెలకు రూ.7,000 నుంచి రూ.12,000 వరకు స్టైపెండ్ పొందే అవకాశం ఉందని తెలిపారు.బీకాంబీఎఫ్ఎస్ఐ కోర్సు ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఫిన్‌టెక్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు ద్వారా హాస్పిటల్ మేనేజ్‌మెంట్, పేషెంట్ కేర్, హెల్త్ ఇన్సూరెన్స్, హెల్త్ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏ విభాగం నుంచైనా ఈ కోర్సులకు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బలమైన కెరీర్ నిర్మించుకోవాలని సూచించారు.దోస్త్ ద్వారా విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చని, మొదటి విడత నమోదు ఈ నెల 7తో ముగుస్తుందని తెలిపారు. రెండో విడత నమోదు ఈ నెల 15 నుంచి 25 వరకు, మూడో విడత నమోదు ఈ నెల 31 నుంచి జూన్ 15 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

## రైతు సంక్షేమ అవగాహన సదస్సు



**చర్ల, మే 06 (ప్రజా జ్యోతి ):** ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా చర్ల మండలంలోని రైతు వేదికలో బుధవారం రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సంక్షేమ అవగాహన సదస్సులో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్ మాట్లాడుతూ పంట రుణాలు, ఎరువులు, పురుగు మందులు, దీర్ఘకాలిక స్వల్పకాలిక రుణాలు, సీఎస్సీ, ఏఈవో సేవలు, బంగారంపై రుణాల వంటి అంశాల్లో సహకార సంఘం తరఫున రైతులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు సంబంధించిన ప్రతి విషయంలోనూ తాము అండగా ఉంటామని తెలిపారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో నాణ్యత లేని విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు రైతులను మోసం చేయవద్దని సూచిస్తూ రైతులు కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు.ఇరిగేషన్ శాఖ ఈఈ తిరుపతిరావు మాట్లాడుతూ చెరువుల్లోని మట్టి వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. చెరువుల పూడిక తొలగింపు సమయంలో రైతులు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇచ్చి మట్టి తరలింపుకు సహకరిస్తామని వివరించారు.ఈ నెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, చర్ల తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం , ఏడీ సుధాకర్, రైతు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారు రామకృష్ణ, సీఈవో ప్రభు, ఏవో లావణ్య, గన్నవరం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, దేవానగరం సర్పంచ్ పూనెం లక్ష్మి, ఏఈఓ అఫ్రిది తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్, పెట్రో ధరలు తక్షణమే తగ్గించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**బూర్గంపహాడ్, మే 6 (ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెట్రో ధరలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని అందులో భాగంగా ఈ నిరసన చేపట్టడం జరిగిందన్నారు. సామాన్యులపై మోయలేని భారాన్ని మోపుతుందని, ధరల పెంపు పై ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు సిద్ధమవుతుందన్నారు. ప్రభుత్వాలు ప్రజల హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, తక్షణమే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సామాన్యులకు ఊరటనివ్వాలని లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నల్లజాల సత్యనారాయణ, అలవాల సీతారాంరెడ్డి, సొల్లు పుల్లయ్య, సిద్ధారపు సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, ముదిగొండ బాలకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము, కుంజా నాగరాజు, భూక్యా నాగేశ్వరరావు, బద్రి, సింగబోయిన వెంకటేశ్వర్లు, పెనుబల్లి మండల కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## భద్రాచలం డీఎస్పీని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు




**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** భద్రాచలం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు బుధవారం భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్‌ను కలిసారు. అనంతరం న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోలీసు యంత్రాంగానికి, న్యాయవాదులకు మధ్య ఉండాల్సిన సమన్వయంపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణలో, న్యాయ విచారణ ప్రక్రియలో పోలీసు శాఖకు బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, మహిళ ప్రతినిధజ ఎం. తరుణీ, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కె. శ్రీమన్నా రాయణ,ఎం.వి.రమ, కె. భాస్కరరావు, రవితేజ, వి. సురేష్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం

- దేవస్థానం నిత్యన్నదానంకు రూ.లక్ష విరాళం



**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేదాశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా ఖమ్మంకు చెందిన బుడిగం వీరయ్య, రేణుక దంపతులు దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం అందజేశారు.

## తిప్పాపురంలో ఆరోగ్య శిబిరం



**చర్ల,మే 06:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం సత్యనారాయణ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆధ్వర్యంలో తిప్పాపురం గ్రామంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందం ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎన్‌సీడీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కూడా చేపట్టి . రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ సమతుల ఆహారం క్రమబద్ధమైన వ్యాయామం తరచూ వైద్య పరీక్షల అవసరాన్ని వివరించారు.

## అమ్మ ఎలా ఉన్నారు...!

- వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ... వారి సమస్యలు వింటూ
- మనసు ధైర్యంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం... బి. భవాని... లీగల సర్వీస్ అథారిటీ చైర్మన్, దమ్మపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జ్, అడిషనల్ జిఎఫ్ సీఎం
- అమ్మ సేవా సదనాన్ని సందర్శించి, వృద్ధులతో మాట్లాడిన జడ్జి బి. భవాని





**అశ్వారావుపేట, మే 06, ప్రజాజ్యోతి :** మనసు ధైర్యంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని మలి జీవితాన్ని ఆనందంగా ఉంచుకుందుకు ప్రయత్నించాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, దమ్మపేట కోర్ట్ సివిల్ జడ్జి, అడిషనల్ జిఎం సిఎం బి. భవాని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని అమ్మ సేవాసదనాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి ఆరోగ్య పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని,అలానే స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ దృష్టికి కూడా తీసుకు వెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. వృద్ధుల పట్ల సమాజం మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆమె సూచించారు. వృద్ధాశ్రమంలో అందిస్తున్న సేవలను అభినందించి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని సేవాసదనానికి 50 కేజీల బియ్యం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొంది మురళీమోహన్, కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు, సీనియర్ న్యాయవాదులు ముప్పిడి శ్యామ్ సుధాకర్, తుమ్మ రాంబాబు, సంధ్య,నల్లపు ఉదయ్ కుమార్, టి అరుణకుమారి, శ్వేత దర్గావళి, గొల్ల భవాని కృష్ణ యాదవ్ కానిస్టేబుల్ ప్రశాంత్, కోర్టు సూపర్నెంట్ సిద్దు మండల లీగల్ సర్వీస్ అథారిటీ స్టాఫ్ రాజ్ కుమార్, అమ్మసేవ సదనం నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జైశ్రీరామ్ అనే హిందువులే ప్రభుత్వానికి భిక్ష పెడుతున్నారు

- సిజిఎఫ్ పేరుతో కోట్ల రూపాయలు భక్తులు చెల్లిస్తున్నారు
- శ్రీ రామునిపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తాం
- తనికెళ్ల రవికుమార్ వి హెచ్ పి భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి





**అశ్వారావుపేట, మే 06, ప్రజాజ్యోతి:** హిందువుల ఆధ్యాత్మిక భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సహించబోమని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల రవికుమార్ తీవ్రంగా హెచ్చరించారు. "జై శ్రీరామ్" అంటూ దేశభక్తిని, ధార్మిక విశ్వాసాన్ని వ్యక్తపరుస్తున్న హిందువులే ప్రభుత్వానికి భిక్ష పెడుతున్నారన్న విషయాన్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గుర్తించాలన్నారు. సీజీఎఫ్ పేరుతో కోట్ల రూపాయల నిధులు భక్తులు సమర్పిస్తున్నారని, ఆ నిధులను గౌరవంగా వినియోగించాల్సిన బాధ్యత గల పదవిలో ఉన్న మీరు మాట్లాడిన మాటలు క్షమించరానివన్నారు .ఇటీవల మంత్రి కొండా సురేఖ శ్రీరామునిపై చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని రవికుమార్ అన్నారు. వెంటనే ఆమె ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిరసనలు నిర్వహించి, హిం దూ సమాజ ఐక్యతను చాటుతామని తెలిపారు. భక్తుల విశ్వాసాలపై ఎవరైనా దూషణలు చేస్తే కఠినంగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామీణ వికాస్ ప్రముఖ్ గొట్టపు అప్పారావు, విశ్వహిందూ పరిషత్ అశ్వారావుపేట, దమ్మపేట మండలాల ప్రఖండ అధ్యక్షులు కలకోటి వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా నాయకులు బండారు చంద్రశేఖర్, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మెట్టా వెంకటేష్, చిట్టి శ్రవణ్ కుమార్, శీమకుర్తి సుబ్బారావు,పలువురు విశ్వహిందూ పరిషత్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబులెన్స్ సేవలు పునరుద్ధరించాలి

- ఆర్ కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్ డిమాండ్



**చర్ల,మే 06:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్ సేవలు లేకపోవడం పట్ల ఆర్. కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.బుధవారం ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురం పరిసర ప్రాంతాల్లోని మెజారిటీ గ్రామాలు ఏజెన్సీ పరిధిలో ఉన్నాయని తెలిపారు. ఇక్కడి ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించాల్సిన అంబులెన్స్ ను వేరే ప్రాంతానికి కేటాయించడం సరైన నిర్ణయం కాదని మండిపడ్డారు.మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఆయన అన్నారు . అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం వలన గర్భిణులు, వృద్ధులు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు సమయానికి ఆసుపత్రికి చేరుకోలేక ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా పేద ప్రజలు ప్రైవేట్ వాహనాల కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. గిరిజన గ్రామాల భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తక్షణమే సత్యనారాయణపురం ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యాన్ని పునరుద్ధరించి ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తుర్రం రవికుమార్ డిమాండ్ చేశారు.

## సేంద్రీయ సాగుకు రైతులు ముందుకు రావాలి

**ములకలపల్లి, మే 6 ప్రజాజ్యోతి:** రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయంపై దృష్టిసారించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. నాగాంజలి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాల మూడవ రోజు ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంట వైవిధ్యీకరణ, నూతన పంటల సాగు పద్ధతులు, భూగర్భ జలాల పెంపుదల, వరిలో సన్న రకాల ప్రోత్సాహం, సేంద్రీయ వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీల వినియోగం, సొసైటీలు మరియు బ్యాంకుల ద్వారా లభించే రుణాలు, బీమా పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పూసుగూడెం సర్పంచ్ పి. ధర్మా, రామవరం సర్పంచ్ ఆదిలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, రమేష్, సుజాత, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహా కుంభాభిషేకం





**చర్ల, మే 06: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో రెండవ మహా కుంభాభిషేక కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆలయం నిర్మాణం పూర్తై 24 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వైశాఖ మాసం కృష్ణ పక్ష పంచమి నాడు ఈ పవిత్ర మహోత్సవాన్ని నిర్వహించారు.ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఆలయ శిఖరంపై నుండి పసుపు, కుంకుమ కలిపిన పవిత్ర జలాలతో పాటు బూరెలతో కుంభాభిషేకం నిర్వహించగా ఈ దృశ్యం భక్తులకు కన్నుల పండువగా నిలిచింది. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, అన్నాభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ మహోత్సవానికి చర్లతో పాటు పరిసర గ్రామాల నుండి వందలాది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు "ఓం నమః శివాయ" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయం మొత్తం పూలతో దీపాలతో అలంకరించగా భక్తి పారవశ్యం స్పష్టంగా కనిపించింది. మధ్యాహ్నం మూడు గంటల నుండి శివ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తులను మరింత ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. భద్రాచలం నుండి విచ్చేసిన అర్చకులు సాయి కృష్ణ శర్మ, తేజ శర్మలు, అలాగే స్థానిక అర్చకులు భాను ప్రకాష్ తదితరులు వేద మంత్రోచ్చారణల మధ్య వైదిక క్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అన్నదాన కార్యక్రమం భక్తులకు ఎంతో సంతృప్తిని కలిగించింది.ఈ మహా కుంభాభిషేక మహోత్సవం చర్ల పట్టణంలో ఆధ్యాత్మికోత్సాహాన్ని నింపింది. భక్తుల రద్దీతో ఆలయం కళకళలాడగా కార్యక్రమం మొత్తం కన్నులపండువగా భక్తి పరవశంగా సాగింది.ఉమా రామలింగేశ్వర స్వామివారి మహా కుంభాభిషేకం విజయవంతంగా నిర్వహించబడటం భక్తులందరికీ ఆనందాన్ని కలిగించింది. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా ధార్మిక భావాలను బలపరుస్తాయని భక్తులు అభిప్రాయపడ్డారు.

# “జై శ్రీరామ్”పై కొండా సురేఖ వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని అవమానించడమే

- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**భద్రాచలం టౌన్ 6 మే , ప్రజాజ్యోతి** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ “జై శ్రీరామ్ అంటే పైసలు రాలతాయా?” అంటూ చేసిన వ్యాఖ్యలు కోట్లాది హిందువుల విశ్వాసాలను కించపరిచేలా ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.“జై శ్రీరామ్” అనేది కేవలం నినాదం కాదని... భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, దేశభక్తికి ప్రతీక అని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉంటూ శ్రీరాముని నామాన్ని అవమానించేలా మాట్లాడడం ఆమె అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ రహదారులు, గిరిజన సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్, రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుంటే, వాటిని గుర్తించకుండా హిందూ విశ్వాసాలపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ అసలు మనస్తత్వాన్ని బయటపెడుతోందన్నారు.పదే పదే పార్టీలు మారుతూ రాజకీయ లాభాల కోసం మాట్లాడే నేతలు ప్రజల ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ఆటలాడటం మానుకోవాలని హెచ్చరించారు. హిందూ దేవతలు, నినాదాలపై వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకులకు అలవాటైందని, ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని అన్నారు.కొండా సురేఖ వెంటనే హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆమెను వెంటనే దేవాదాయ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మారావు, చుక్కపల్లి బాలాజీ, జజ్జూరు మోహన్ కృష్ణ, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, బోడ సత్యనారాయణ, ట్రిపుల్ ఎక్స్ చక్రవర్తి, షేర్ శ్రీను, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసి





**బూర్గంపహాడ్, మే 6 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 42 రోజులుగా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న సంగతి పాఠకులకు విధితమే. మంగళవారం రాత్రి జనరల్ బాడీ మీటింగ్ లో గుర్తింపు సంఘం వేతన ఒప్పంద వివరాలు వెల్లడించిన తర్వాత కాంట్రాక్టు కార్మికులు వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా పీఎం 6 గేటు వద్ద వంటావార్పు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. వేతన ఒప్పందంలో కాంట్రాక్టు కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని సీ షిఫ్ట్ కార్మికులు విధులు బహిష్కరించడంతో అదే సమయంలో ఓ కాంట్రాక్టర్ కార్మికులను లోనికి పంపే ప్రయత్నం చేశారని...ఆ క్రమంలో జరిగిన తోపులాటలో ఓ కార్మికుడి తలపై రాడ్డుతో వెనుక నుంచి దాడిచేయడంతో తలకు తీవ్రగాయమైందని.. స్థానికులు అతన్ని ఆసుపత్రికి పంపినట్లు కార్మికులు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులపై ఇలాంటి దాడుల చేయడం అన్యాయమని... తమకు న్యాయం జరిగేంతవరకు నిరసన తెలుపుతామని కాంట్రాక్టు జేఏసీ కార్మిక నాయకులు పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజాము వరకు వంటావార్పుతో కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలుపుతూనే ఉన్నారు. నిరసన అనంతరం కాంట్రాక్టు కార్మికులతో యాజమాన్యం, గుర్తింపు సంఘం చర్చలు జరిపి మూడు రోజుల పాటు సమ్మెను వాయిదా వేయాలని అడిగారని... కాంట్రాక్టు కార్మికులు ఆ మేరకు అంగీకారం తెలిపారని...సమస్య పరిష్కారం కాకపోతే గడువు తర్వాత మళ్లీ సమ్మె చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# కనీస వేతనాల్లో కోతలపై నిరసన గళం



**కొత్తగూడెం, మే 6 ( ప్రజాజ్యోతి )** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరిని తక్షణమే విడనాడాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య డిమాండ్ చేశారు. కార్పొరేట్ పరిధిలోని వాటర్ సప్లై కాంట్రాక్ట్ కార్మికుల అడ్డా వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన కరువు భత్యాన్ని మార్చి నెలలో సెంట్రల్ లేబర్ డిపార్ట్మెంట్ విడుదల చేసినప్పటికీ దానికి సంబంధించిన అంతర్గత సర్క్యులర్‌ను సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు జారీ చేయకపోవడం వల్ల వేతనాల చెల్లింపులో తీవ్ర ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. టెండర్ నిబంధనల ప్రకారం పెరిగిన కరువు భత్యాన్ని వెంటనే వేతనాల్లో కలిపి చెల్లించాల్సి ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.556 చెల్లించాల్సి ఉండగా రూ.541 మాత్రమే చెల్లించడం చట్ట విరుద్ధమని ఇది కనీస వేతనాల చెల్లింపు చట్టం–1948 ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. ఈఎస్ఐ అమలులోనూ నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. ఫిబ్రవరి 12న జరిగిన సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ మినహాయింపులో ఆలస్యం ఎందుకని ప్రశ్నించారు. ఈ సమస్యల కారణంగా సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టర్లు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారిన నేపథ్యంలో బి కేటగిరి వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ భాస్కర్, వీరయ్య, విక్రమ్, రమేష్ పాసి, నరేష్, సంపత్, సునీల్, గురుమూర్తి, కృష్ణ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

- **దుగినపల్లి నుండి ఏడూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ**







**పినపాక,మే 06(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలోని అభివృద్ధి ప్రదాత అయిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను నియోజకవర్గ నాయకులు కొర్స బాలకృష్ణ, పినపాక కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది కార్యకర్తలు దుగినపల్లి నుంచి ఏడూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బయ్యారం క్రాస్ రోడ్ లో భారీ కేకును కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి పేద ఇంటికి అందుతున్నాయని అన్నారు. సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న పాయం వెంకటేశ్వర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో పినపాక మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు మెంబర్లు, అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరల పెంపుపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



**ములకలపల్లి మే 06, ప్రజాజ్యోతి:** పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, పెట్రోలు–డీజిల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్యాస్ ఆఫీస్ ఎదుట బుధవారం ఖాళీ సిలిండర్లతో ధర్నా నిర్వహించారు.సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపు వల్ల చిరు వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు, బజ్జీ బండ్లు నడిపే వారికి తీవ్ర భారం పడిందని తెలిపారు. గ్యాస్ ధరలు పెంచడంతో టిఫిన్ ధరలు పెరిగి ఆ భారం పేద ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు., పెట్రోలు మరియు డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చూడాలని, అలాగే మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకులు నారాటి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వరక అజిత్, ఏవైఎఫ్ నాయకులు అనుముల సాయి, సిపిఐ నాయకులు బోప్పిడి ఇమ్మానియేల్, హమాలి యూనియన్ నాయకులు మిరియాల వెంకన్న, తుమ్మలపల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరలు తగ్గించాలి.. ప్రజలపై భారాలు తగ్గించండి

- **సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో వినూత్న నిరసన**

**కొత్తగూడెం, మే 6 ( ప్రజాజ్యోతి )** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలపై నిత్యావసర భారాలు మోపుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ సెంటర్ లో భారీ ధర్నా నిర్వహించారు. ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలతో సామాన్యుడి వంటిల్లు మండుతుంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో వైఫల్యం కనబరుస్తూ కార్పొరేట్ శక్తుల దోపిడీకి ప్రోత్సాహం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలహీనపరిచి పేదల నోటికాడ ఉన్న అన్నాన్ని లాగేస్తున్నారని వెంటనే పీడీఎస్ ను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి వాటిని వ్యాపార వస్తువులుగా



మార్చడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఇంధన కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటాలను గ్రామ గ్రామానికి విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, ఎస్ కే ఫహీమ్, దీటి లక్ష్మీపతి, కె రత్నకుమారి, మునిగడప పద్మ తదితరులు పాల్గొన్నారు

## పంచాయితీ కార్మికుల పై వేధింపులు ఆపాలి

- సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు



**ములకలపల్లి, మే 06, ప్రజాజ్యోతి:** మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ సిబ్బందిపై జరుగుతున్న వేధింపులను వెంటనే ఆపాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు వున్నారు. వేధింపులు కొనసాగితే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిమ్మల మధుతో పాటు గ్రామ పంచాయతీ ఉద్యోగుల కార్మికుల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కుల శ్రీను, మండల అధ్యక్షుడు గంటా శ్రీను పాల్గొని మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల అనంతరం ఏర్పడిన పాలకవర్గాలకు సిబ్బందిపై చర్యలు తీసుకునే అధికారం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ, కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పదేపదే వేధింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. మాదారం గ్రామ పంచాయతీలో ఇటువంటి ఘటనలు గత కొంతకాలంగా కొనసాగుతున్నాయని, దీని వల్ల సిబ్బందిలో భయాందోళనలు పెరిగి, అభద్రత భావం నెలకొంటోందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి సిబ్బంది సహకారం అవసరమని, వారిని వేధించడం సరైంది కాదని సూచించారు. ఇప్పటికైనా వేధింపులను నిలిపివేయాలని, లేనిపక్షంలో సిబ్బంది, కార్మికులను సమీకరించి పోరాట కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

## రైతుల అభివృద్ధికి సహకార సంఘాల సేవలను వినియోగించుకోవాలి

- అన్నపురెడ్డిపల్లి రైతు వేదికలో రైతు సంక్షేమ అవగాహన సదస్సు నిర్వహణ



**అన్నపురెడ్డిపల్లి, మే 6, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు సంక్షేమ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గుంపెన సొసైటీ అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు బ్యాంకింగ్ సేవలు, సహకార సంఘాలు అందించే పథకాలు, రుణ సదుపాయాలు, పొదుపు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమని, రైతులు పంట రుణాలు, పొదుపు పథకాలు, బీమా సదుపాయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రైతుల ఆర్థిక స్థిరత్వానికి బ్యాంకింగ్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. డీసీసీబీ చంద్రుగొండ మేనేజర్ ప్రశన్న ప్రియ రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై వివరించగా, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి బ్యాంకింగ్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు పెద్దిరెడ్డిగూడెం శాఖ మేనేజర్ కె. జీవన్ రైతులకు వివిధ రకాల రుణ పథకాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి జి. అనూష ఆధునిక సాగు విధానాలపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తూరు వెంకటేశ్వరరావు, చల్లా రాంబాబు, బోయినపల్లి గోపీనాథ్, జంగాల ఉమా మహేశ్వరరావు, పెద్ద గౌండ్ల పుల్లారావు, పరస మాధవరావు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు అన్నపురెడ్డిపల్లి శాఖ క్షేత్రాధికారి దుర్గ ప్రసాద్, అన్నపురెడ్డిపల్లి డీసీసీబీ శాఖకు చెందిన మజీద్, సంఘ కార్యదర్శి కె. శ్రీనివాస్ రావు, పర్యవేక్షణ అధికారి బి. ఆనందం తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# పాయం జన్మదిన వేడుకల కోలాహలం మర్కోడులో ఘనంగా కేక్ కట్ చేసిన నాయకులు





**ఆళ్ళపల్లి. మే6. ప్రజా జ్యోతి** పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుజన్మదిన వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా పండగ వాతావరణంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మర్కోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు అత్యంత ఘనంగా నిర్వహించారు. మర్కోడు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ ప్రియతమ నాయకుడు పాయం వెంకటేశ్వర్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూతారీ రమాదేవి (సర్పంచ్)వగలబోయిన సతీష్ (ఉప సర్పంచ్)పడిగా సమ్మయ్య (కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ) ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో నియోజకవర్గం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు దక్కాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు,వార్డ్ సభ్యులు. కేక్కర్ల సునీతా. సుతారి క్రిష్ణ. పర్వీన్. వేణు.దొడ్డి రాము. ముప్పారపు రాము. బూర్ల రవి. కన్నయ్య. చంద్రం.శేఖర్. కోటేష్. పంచాయతీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బి టి పి ఎస్ బూడిదతో బయ్యారం గ్రామంలో తీవ్ర కాలుష్యం





- -ప్రజల ఆరోగ్యంపై ప్రభావం.. ప్రభుత్వం స్పందించాలని గ్రామస్తుల డిమాండ్

**పినపాక,మే 06(ప్రజాజ్యోతి):** పినపాక మండలం ఈ బయ్యారం గ్రామ పంచాయతీలో బిటిపిఎస్ బూడిద సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలోని పరిసరాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజూ పరిసరాలను శుభ్రపరుస్తున్నప్పటికీ, కొద్దిసేపటికే మళ్లీ బూడిద పేరుకుపోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇళ్ల ప్రాంగణంలు, రహదారులు, ఇళ్ల పైకప్పులు, చెట్లు అన్నీ బూడిదతో కప్పుకుపోతున్నాయని వారు తెలిపారు. గ్రామ ప్రజలు స్వయంగా బూడిద పేరుకుపోయిన ప్రాంతాలను చూపిస్తూ సమస్య తీవ్రతను వెల్లడించారు. బూడిద కురుస్తుండటంతో గ్రామంలో వాతావరణ కాలుష్యం పెరిగి శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయని మహిళలు, వృద్ధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో గాలిలో ఎగిరే బూడిద కారణంగా బయట తిరగడమే కష్టంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బి టి పి ఎస్ యాజమాన్యం బూడిద నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణమే గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో రైతు సదస్సు వార్షికోత్సవం

- రైతులకు బోనస్,రుణ మాఫీ ఇన్సూరెన్స్ ఇచ్చిన ప్రభుత్వం.



**సుజాత నగర్ ప్రజాజ్యోతి మే 06 :** మండలం లో రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సుజాతనగర్ రైతు వేదిక నందు కొత్తగూడెం సొసైటీ వారి ఆధ్వర్యంలో కొత్తగూడెం సొసైటీ అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు అధ్యక్షతన ఏర్పాటు చేసినటువంటి రైతు సదస్సు వార్షికోత్సవాల్లో భాగంగా అధ్యక్షులు మాట్లాడుతూ రైతులకు సొసైటీ ద్వారా విత్తనాలు, ఎరువులు రైతులు పండించిన వరి మొక్కజొన్నలు మద్దతు ధరతో పాటు ధాన్యానికి 500 రూపాయలు బోనస్ రైతు రుణమాఫీ రైతులకు ఇన్సూరెన్స్,రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్ కు సంబంధించిన ఎరువులు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది అన్నారు.రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది అని అలాగే పంటల దిగుబడి ధర, ధాన్యం సేకరణ ఇతర అంశాల్లో ప్రభుత్వం రైతులకు వెన్నంటే ఉంటుంది అని తెలిపారు.ఇంకా అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు,ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి, రేణుక చౌదరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నటువంటి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు ,సుజాతనగర్ తహసీల్దారు ,సంఘ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్మోహనరావు , కార్పోరేటర్స్ చింతలపూడి శ్రావణి , బానోత్ అనిత , ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్లు, సంఘ డైరెక్టర్లు బండి అమృతరావు, కర్నాటకపు రామచందర్ రావు, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, ఏవో నర్మద , సర్పంచులు శ్రీకాంత్ , వి.రామారావు , కె.వెంకన్న, రైతులు, వీర్ల రమేశ్ , యన్ పుల్లయ్య గ, బి శ్రీను , తదితరులు పాల్గొనడం జరిగింది